
సాక్షి
పల్నాడు
ఆదివారం । 8 । జూన్ । 2025



ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం: వేమవరంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయ 21వ వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను ఊరేగించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్:నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 511.60 అడుగుల వద్ద ఉంది. ఇది 134.4032 టీఎంసీలకు సమానం.

నేడు కృష్ణవేణి విగ్రహ ప్రతిష్ట



రెంటచింతల: సత్రశాల వద్ద శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి దేవస్థానం ఆవరణలో ఆదివారం కృష్ణవేణి అమ్మవారి విగ్రహం ప్రతిష్టించనున్నట్లు ఈఓ గాదె రామిరెడ్డి, అన్నదాన కమిటీ సభ్యులు తెలిపారు.

న్యూస్‌రీల్

ఆంజనేయస్వామి విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన



రొంపిచర్ల: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్‌వే పక్కన శ్రీ ఆంజనేయస్వామి భారీ విగ్రహం ఏర్పాటుకు శనివారం గ్రామస్తులు శంకుస్థాపన చేశారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ హైవే రోడ్డుపై తరచూ ప్రమాదాలు జరగడం, ప్రాణాలు కోల్పోవడం, వికలాంగులు అవ్వడం లాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ప్రమాదాల నివారణకు హైవే రోడ్డులో ఉన్న గ్రామాలతో పాటు పరిసర గ్రామాలలో అరిష్టాలు జరగకుండా ఉండేందుకు శ్రీ ఆంజనేస్వామి భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. శంకుస్థాపన కార్యక్రమంలో విశ్రాంత వీఆర్వో పడాల సుబ్బారెడ్డి, గ్రామ పెద్దలు పడాల వీరారెడ్డి, కొమ్మారెడ్డి రామిరెడ్డి, పల్లెల నాగిరెడ్డి, ఎం.వెంకటేశ్వర్లు, వల్లభరావు, పి.రామాంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏపీసీబీఈఏ రాష్ట్ర మహాసభలు

చిలకలపూడి(మచిలీపట్నం): ఆంధ్రప్రదేశ్ కోఆపరేటివ్ బ్యాంక్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్(ఏపీసీబీఈఏ) పదో రాష్ట్ర మహాసభలు మచిలీపట్నంలో ఆదివారం నిర్వహించనున్నట్లు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.గోపీనాథ్ శనివారం తెలిపారు. జిల్లా కోర్టు సెంటర్‌లోని రెవెన్యూ కల్యాణ మండపంలో మహాసభలు జరుగుతాయని పేర్కొన్నారు. మహాసభలకు 13 జిల్లాల డీసీసీబీ ఉద్యోగులు హాజరుకానున్నారని తెలిపారు. సమావేశానికి జిల్లాలోని సహకార బ్యాంకుల ఉద్యోగులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

నిత్యాన్నదానం, బంగారు తాపడం పనులకు విరాళాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి, బంగారు తాపడం పనులకు విజయవాడకు చెందిన భక్తులు శనివారం రూ. 2.52 లక్షల విరాళాన్ని అందజేశారు. నగరంలోని రామచంద్రనగర్‌కు చెందిన బట్టు నాగేశ్వరరావు కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. నాగేశ్వరరావు పేరిట రూ. 1,51,116 విరాళాన్ని, జిష్ణురావు పేరిట బంగారు తాపడం పనులకు రూ. 1,01,116 విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందించారు.

రైల్వేస్టేషన్‌లో ఆహార భద్రతపై శిక్షణ

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రపంచ ఆహార భద్రత దినోత్సవం సందర్భంగా శనివారం విజయవాడ రైల్వేస్టేషన్‌లోని స్టేషన్ డైరెక్టర్ కార్యాలయంలో ఆహార భద్రతపై రైల్వే ఫుడ్ సేఫ్టీ అధికారులు, ఎఫ్‌బీఓ (ఫుడ్ బిజినెస్ ఆపరేటర్స్)లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్యఅతిథి రైల్వే హాస్పటల్ సీఎంఎస్ డాక్టర్ శ్రీనివాసులు ఆహార భద్రతపై పాటించాల్సిన మార్గదర్శకాలను వివరించారు. నిబంధనలకు అనుగుణంగా ఆహారం తయారీ, వ్యక్తిగత పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఆహారాన్ని సక్రమంగా నిల్వచేయడం వంటి ముఖ్యమైన విషయాలపై దృష్టి పెట్టాలని తెలిపారు. 'ఈట్ రైట్ ఉద్యమం' ఆరోగ్యకరమైన ఆహార వాతావరణానికి బలమైన పునాది వేసిందని, ఆ దిశగా విజయవాడ రైల్వేస్టేషన్ ఆహార భద్రతపై నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో రైల్వే హాస్పటల్ ఏసీఎంఎస్ డాక్టర్ ఎం.జైదీప్, రైల్వే ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ఎస్.కె. రెహ్మాతుల్లా, స్టేషన్ డైరెక్టర్ శైలజ, స్టేషన్ మాస్టర్ సాంబశివరావు, ఐఆర్‌సీటీసీ ఏఎం రాజా తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీటీపీఎస్‌లో ఏపీఎస్పీఎఫ్ డీజీ

ఇబ్రహీంపట్నం: ఏపీఎస్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ త్రివిక్రమ వర్మ శనివారం ఎన్టీటీపీఎస్‌ను సందర్శించారు. ప్రధాన గేటు వద్ద ముందుగా సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. తర్వాత ప్లాంట్‌లో స్టేజి 1 నుంచి 4 వరకు సందర్శించారు. కోల్‌ప్లాంట్‌లో వ్యాగన్ టిప్లర్ గురించి ఏడీఈ హేమానంద్ వివరించారు. ఎస్ఈ అనురాధ కోల్‌తో విద్యుత్ తయారీ విధానం.. యూనిట్ కంట్రోల్ బోర్డు ద్వారా వివరించారు.

నాడు

కులం, మతం, వర్గం, ప్రాంత, పార్టీ బేధం లేకుండా పేదలందరికీ గ్రామాల్లో సెంటున్నర, పట్టణాల్లో సెంటు స్థలాన్ని నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేశారు. ఎన్నో లక్షల మందికి సొంతింటి కలను వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నెరవేర్చారు. స్థలం ఇవ్వడమే కాకుండా గృహ నిర్మాణాలకు రూ.2లక్షలు ఆర్థికసాయం అందజేశారు. ఇసుక, స్టీలు, ఇటుక, సిమెంట్ ఫ్రీగా అందజేశారు. ఇళ్లు పూర్తయిన తర్వాత లబ్ధిదారులైన మహిళల పేరుతోనే రూపాయికే వారిపేరుపై రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చారు. దీంతో పాటు ఐదేళ్ల గడిచిన పిమ్మట వాటిని మరొకరికి విక్రయించుకునే వెసులుబాటు కల్పించారు. గత వైఎస్సార్ సీపీ హయాంలో ఎంతోమంది సొంతిల్లు కట్టుకుని ఆనందంగా ఉన్నారు.



నరసరావుపేట వినుకొండ రోడ్డులోని జగనన్న కాలనీలోని ఓ వీధి

నేడు

అధికారంలోకి వస్తే గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల స్థలం ఇస్తామని చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు ఊరూరా ఊదరగొట్టాడు. తీరా అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఒక్కరికీ ఒక్క సెంటు స్థలం ఇచ్చింది లేదు. అర్హులైన పేదలు గత ఏడాదిగా ఇళ్ల స్థలం కావాలంటూ అధికారులకు అర్జీలు అందజేస్తూ, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.. అర్జీలు బుట్టదాఖలే తప్ప ఒక్కటీ పరిష్కారానికి నోచుకుంది లేదు. పేదలకు స్థలాలివ్వకపోగా, గత ప్రభుత్వంలో ప్రారంభమైన ఇళ్ల నిర్మాణాలపైనా కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది.



అనుగ్రహం లేదు

కూటమి ఏడాది పాలనలో పేదవాడి సొంతింటి కల ఛిద్రం

- పట్టణాల్లో రెండు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇస్తామని ఎన్నికల్లో హామీ
- ఏడాదిగా అన్ని గ్రీవెన్సుల్లోనూ అర్జీలు, అధికారులకు వినతులు
- అయినా ప్రయోజనం శూన్యం
- సెంటు స్థలమైనా ఇవ్వని కూటమి ప్రభుత్వం
- ఇళ్లకోసం వేలాదిగా ఎదురుచూస్తున్న పేదలు
- సొంతిల్లు లేక అద్దె ఇళ్లల్లో పేదల ఇక్కట్లు
- జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలపైనా చిన్నచూపు



నరసరావుపేట: సొంతిల్లు అనేది పేద, మధ్యతరగతి ప్రజలకు ఒక కల. ఆ కలలను నేటి కూటమి ప్రభుత్వం కల్లలుగా చేసింది. తాము అధికారంలోకి వస్తే.. పట్టణంలో రెండుసెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామంటూ మహిళలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకున్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఇంతవరకు ఏ ఒక్కరికీ సెంటు స్థలం ఇచ్చిన దాఖలాలు లేవు. తమకు ఇళ్ల స్థలాలు కావాలంటూ అర్హులైన పేదలు ఏడాదిగా అధికారులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ అర్జీలు అందజేస్తున్నారు. అయితే వాటిలో ఏ ఒక్కటీ పరిష్కరం కాకపోగా.. అవన్నీ బుట్టదాఖలుగానే మిగిలిపోతున్నాయి.

నాడు పేదలందరికీ పట్టాలు, ఇళ్లు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జగనన్న కాలనీలను ఏర్పాటుచేసి పట్టణాల్లో సెంటు, గ్రామాల్లో సెంటున్నర చొప్పున వేలాదిమందికి ఇళ్లపట్టాలను అందజేశారు. నరసరావుపేట మున్సిపాల్టీ పరిధిలోని పేద మహిళలకు వినుకొండరోడ్డు, కేసానుపల్లిరోడ్డు టిడ్కో గృహాల వద్ద 5,957మందికి పట్టాలు అందజేశారు.

- వీరికోసం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సుమారు రూ.35కోట్ల వ్యయంతో ప్రభుత్వ, ప్రైవేటు భూమిని సేకరించారు. ఇల్లు కట్టుకునే వారికి కేంద్ర ప్రభుత్వం రూ.1.5లక్షలు అందజేస్తే మిగతా రూ.50వేలను కలిపి రూ.2లక్షలు అందజేశారు. ఇసుక, స్టీలు, ఇటుక, సిమెంట్ ఫ్రీగా అందజేశారు.
- వీరిలో 1893 మంది ఇళ్లు పూర్తిచేసుకుని, గృహ ప్రవేశాలు చేశారు. రూఫ్‌ను 266 గృహాలు పూర్తిచేసుకోగా, రూఫ్ లెవెల్‌కు 143, లెంటిల్ లెవెల్‌కు 45 చేరాయి.
- ఇల్లు పూర్తయిన తర్వాత లబ్ధిదారులైన మహిళల పేరుతోనే రూ.1 ఖర్చుతో వారిపేరుపై రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చారు. దీంతో పాటు ఐదేళ్ల గడిచిన పిమ్మట వాటిని మరొకరికి విక్రయించుకునే వెసులుబాటు కల్పించారు.



జగనన్న కాలనీలో పూర్తయిన గృహాలు(ఫైల్)

- జిల్లాలో 16 ప్రదేశాల్లో జగనన్న కాలనీలను ఏర్పాటుచేసి అందులో 38049మందికి ఇళ్ల పట్టాలు అందజేయగా ఇప్పటివరకు 14,972 గృహాలు మాత్రమే పూర్తయ్యాయి. వీటిలో మూడోవంతుకుపైగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే లబ్ధిదారులు పూర్తిచేసుకున్నారు.

సెంటు స్థలం ఇచ్చింది లేదు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పక్కా ఇళ్ల పథకం నిలిచిపోయింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్ల నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోయాయి. 2014–19మధ్య టీడీపీ ప్రభుత్వం కేసానుపల్లిరోడ్డులో 1504 మందికి చేపట్టిన టిడ్కో గృహాలను సకాలంలో పూర్తిచేయకుండానే దిగిపోయారు. మౌలిక వసతులు కల్పించలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాగానే సుమారు రూ.18కోట్లను కేటాయించి మట్టిరోడ్డుగా ఉన్న మెయిన్‌రోడ్డును సీసీరోడ్డుగా మార్చి మధ్యలోని కాలువపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేశారు. టిడ్కో గృహాల మధ్య రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి వసతికోసం ఓవర్‌హెడ్ ట్యాంకు, విద్యుత్ సౌకర్యం కల్పించారు. దీంతో ఇప్పుడు ఆ గృహాల్లో 150 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి.

వైఎస్సార్ సీపీ హయాంలో పేదల గృహ వైభోగం

నియోజకవర్గం	మండలం	అందజేసిన పట్టాలు	పూర్తయిన గృహాలు
చిలకలూరిపేట	యడ్లపాడు	1160	449
చిలకలూరిపేట	చిలకలూరిపేట అర్బన్	2388	727
నరసరావుపేట	నరసరావుపేట అర్బన్	5957	1893
వినుకొండ	నూజెండ్ల	780	328
వినుకొండ	వినుకొండ అర్బన్	4360	1797
వినుకొండ	వినుకొండ	289	223
గురజాల	దాచేపల్లి అర్బన్	1549	641
గురజాల	గురజాల అర్బన్	1413	922
గురజాల	పిడుగురాళ్ల అర్బన్	2392	1651
మాచర్ల	మాచర్ల అర్బన్	4555	707
పెదకూరపాడు	అమరావతి	2381	739
పెదకూరపాడు	అచ్చంపేట	2563	926
పెదకూరపాడు	క్రోసూరు	2210	926
పెదకూరపాడు	పెదకూరపాడు	1538	553
సత్తెనపల్లి	సత్తెనపల్లి	1465	973
సత్తెనపల్లి	సత్తెనపల్లి అర్బన్	3049	1517
మొత్తం		38049	14972

25వేల దరఖాస్తులు ఇచ్చాం



ఇచ్చిన హామీ మేరకు పేదలకు పట్టణాల్లో రెండుసెంట్లు, గ్రామాల్లో మూడుసెంట్లు కూటమి ప్రభుత్వం ఇవ్వాలి. ఈ మేరకు సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 25వేల దరఖాస్తులు అధికారులకు అందజేశాం. ఇచ్చిన హామీని కూటమి నాయకులు నెరవేర్చాలి.

–కాసా రాంబాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి

హామీ నెరవేర్చాలి



గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని అమలుచేయాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వానిదే. ఏడాది గడుస్తున్నా దాని ఊసే లేకపోవటం బాధాకరం. ఇళ్లు అవసరమైన వారు ఎంతోమంది ఉన్నారు. ఇచ్చిన హామీని మరిస్తే పేదల తరఫున పోరాటానికి సిద్ధం.

–పి.వెంకటేశ్వరరావు, గిరిజన కార్పొరేషన్ మాజీ డైరెక్టర్

త్యాగానికి ప్రతీక బక్రీద్



బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. చిలకలూరిపేట అడ్డరోడ్డు సెంటర్‌వద్ద ఉన్న ఈద్గా మైదానంలో శనివారం ఉదయం వేలాది మంది సామూహిక ప్రార్థనలు చేశారు. ముఫ్తీ పఠాన్ అనస్‌ఖాన్ మాట్లాడుతూ త్యాగానికి ప్రతీక బక్రీద్ అని, సంకుచిత ధోరణి వీడితే త్యాగం పరిఢవిల్లుతుందని వివరించారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని బక్రీదు శుభాకాంక్షలు చెప్పకున్నారు. - చిలకలూరిపేట

ఎనిమిదేళ్ల కష్టమే కన్నప్ప



వేదికపై సినీ నటులు మంచు మోహన్‌బాబు, విష్ణు, ప్రభుదేవా, బ్రహ్మానందం, బాలాజీ, రఘుబాబు, సప్తగిరి, తాడిశెట్టి బ్రదర్స్

- హీరో విష్ణు పది కాలాలపాటు కన్నప్పగా నిలిచిపోతాడు
- ప్రతి ఒక్కరూ అద్భుతంగా నటించారు
- నటుడు మోహన్‌బాబు
- గుంటూరులో కన్నప్ప ప్రీ రిలీజ్ ఈవెంట్

నగరంపాలెం: ఎనిమిదేళ్ల కష్టమే కన్నప్ప చిత్రమని సినీనటుడు మంచు మోహన్‌బాబు అన్నారు. గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శనివారం సాయంత్రం కన్నప్ప చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే తాడిశెట్టి వెంకట్రావు, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహణ కార్యదర్శి తాడిశెట్టి మురళీమోహన్ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం జరగ్గా, ఏసీ కళాశాల నుంచి విజ్ఞాన మందిరం వరకు ర్యాలీ కొనసాగింది. నటుడు మోహన్‌బాబు మాట్లాడుతూ కన్నప్పను పరమేశ్వరుడు ఆశీర్వదించారని అన్నారు. ఈ చిత్రంలో నటుడు మంచు విష్ణు రెండు పాత్రలు పోషించారని, చాలా అద్భుతంగా నటించాడని చెప్పారు. మళయాళం, తమిళం, హిందీ, తెలుగు భాషల్లోని అగ్రనటులు పలు పాత్రల్లో పోషించారని, ఆయా పాత్రలకు వారిని అడిగిన వెంటనే ఒప్పుకున్నారన్నారు. అగ్రనటుడు ప్రభాస్, నేను బావ అని అప్యాయంగా పిలుచుకుంటామని, పాత్ర గురించి చెప్పగానే అందులో నటించేందుకు అంగీకరించాడని అన్నారు. వైజాగ్, విజయవాడ, రాజమండ్రి, తిరుపతిలలో ఈవెంట్ చేద్దామని భావించామని, అయితే గుంటూరులో చేయడం ఆనందంగా ఉందన్నారు. చాన్నాళ్ల తర్వాత గుంటూరు వచ్చానని పేర్కొన్నారు. 1991 నుంచి తాడిశెట్టి వెంకట్రావుతో పరిచయం ఉందన్నారు.

కన్నప్ప నాలో మార్పు తీసుకొచ్చింది: విష్ణు

నటుడు మంచు విష్ణు మాట్లాడుతూ నా దేవుడు నాన్న అని, ఆయన లేకపోతే నేను లేనన్నారు. నటుడు ప్రభాస్‌కు ఎంతగానో రుణపడి ఉంటానని పేర్కొన్నారు. కన్నప్ప చిత్ర ప్రయాణం నాలో ఎంతగానో మార్పు తీసుకువచ్చిందన్నారు. హాస్యనటుడు బ్రహ్మానందం మాట్లాడుతూ మోహన్‌బాబు తనపై ఉన్న వాత్సల్యంతో ఈ చిత్రంలో పాత్ర ఇచ్చారన్నారు. పది కాలలపాటు కన్నప్పగా మంచు విష్ణు నిలిచిపోతాడని పేర్కొన్నారు. గుంటూరు బాగా పరిచయమైన స్థలమని, ఇక్కడ చదువుకున్నానని తెలిపారు. గతంలో ఈ ఊరు వచ్చి లారీలకు రంగులేశానని గుర్తుచేసుకున్నారు. దర్శకుడు ముకేష్ కుమార్‌సింగ్, నృత్యదర్శకుడు ప్రభుదేవా, నటులు రఘుబాబు, శివబాలాజీ, సప్తగిరి, ముకేష్ రుషి చిత్ర బృందం పాల్గొన్నారు. అనంతరం మోహన్‌బాబును వెండి కిరీటంతో సత్కరించగా, తాడిశెట్టి సోదరులను మోహన్‌బాబు సత్కరించారు.

ఇష్టం లేకపోతే బయట పని చూసుకోండి



కేశఖండనశాల సిబ్బందికి హెచ్చరికలు జారీ చేస్తున్న ఈఓ శీనానాయక్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కేశఖండనశాలలో సిబ్బంది పని తీరుతో దేవస్థానానికి చెడ్డ పేరు వస్తే క్షమార్హం కాదు.. సేవా దృక్పథం ఉండాలి...లేనప్పుడు బయట వేరే పనులు చూసుకోండి.. భక్తుల నుంచి ఫిర్యాదులొస్తే అదే రోజు ఉద్యోగం నుంచి బయటకు పంపడమే కాదు పోలీసులకు సైతం ఫిర్యాదు చేస్తాం...ఉద్యోగం లేని రోజు.. ఎలా ఉంటుందో ఊహించుకోండని దుర్గగుడి ఈవో శీనానాయక్ హెచ్చరించారు. మహా మండపం ఆరో అంతస్తులో దుర్గగుడి కేశఖండనశాల సిబ్బంది, ప్రయివేటు సెక్యూరిటీ సిబ్బందితో శనివారం ఆయన సమావేశమయ్యారు. భక్తులను ఇబ్బంది పెడితే విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. శుక్రవారం రెండు వీడియో ఫిర్యాదులు తన వద్దకు వచ్చాయని, దేవదాయ చట్టం ప్రకారం నిబంధనలు కఠినంగా ఉన్నాయని, భక్తులను ఇబ్బంది పెట్టే వారిపై కేసు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. కేశఖండనశాలలో సిబ్బందికి ఏమైనా ఇబ్బందులు, వేతనాల సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. దేవస్థానం గురించి వచ్చిన ఫిర్యాదులపై అన్ని కోణాల్లో విచారిస్తామని, సిబ్బంది తప్పు ఉంటే చర్యలు తీసుకుంటామని, ఎవరినీ ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెట్టే చర్యలు ఉండవని స్పష్టం చేశారు.

భక్తులను గౌరవిస్తే ఆలయానికి మంచిపేరు

ఇంద్రకీలాద్రి క్షేత్రంలో ప్రతి చోట భక్తులను గౌరవించాలని, ఆప్యాయతను చూపిస్తే ఆలయానికి మంచి పేరు వస్తుందని ప్రయివేటు సెక్యూరిటీ సిబ్బందికి ఈవో సూచించారు. దాదాపు నెల రోజుల నుంచి సెక్యూరిటీ సిబ్బందిని గమనిస్తున్నానని, వారు యాంత్రికంగానే ఉద్యోగం చేస్తున్నట్లు కనిపిస్తోందన్నారు. దుర్గాఘాట్‌లో విచ్చలవిడిగా షాంపులు, సబ్బులు వాడుతూ నది పవిత్రతను దెబ్బతీస్తున్నా కనీసం సెక్యూరిటీ సిబ్బందిగాని, శానిటేషన్ సిబ్బంది గాని అడ్డు చెప్పడం లేదన్నారు. భక్తులు ఎన్నో బాధలతో వస్తుంటారని, వారితో మర్యాదగా, గౌరవంగా మాట్లాడి దర్శనం, ఉచిత ప్రసాదం, అన్న ప్రసాదం అందేలా చూస్తే వారు ఎంతో సంతోషిస్తారన్నారు. కొండపై సెల్‌ఫోన్లతో భక్తులు ఇష్టానుసారం ఫొటోలు దిగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. సుమారు వెయ్యి మంది సిబ్బంది ఉన్న ఈ ఆలయంలో భక్తులతో ఎలా ప్రవర్తిస్తున్నామో సిబ్బంది ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. కొంతమంది సిబ్బంది వైఫల్యం వల్ల దేవస్థానం మొత్తానికి చెడ్డ పేరు వస్తుందన్నారు. కార్యక్రమంలో ఆయా విభాగాల ఏఈవోలు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

వైభవంగా శోభాయాత్ర



విజయవాడ కల్చరల్: వేంకటేశ్వరుడి శోభాయాత్ర వైభవంగా జరిగింది. పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండప ప్రాంగణంలోని పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం దేవాలయంలో నిర్వహించిన వైదిక కార్యక్రమాలు భక్తిగా సాగాయి. ఉదయం వేంకటేశ్వర స్వామికి దేవాలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వివిధ రకాల పూలతో అలంకరించిన పల్లకీపై పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామిని దేవాలయ ప్రాంగణంలో ఊరేగించారు. దేవాలయన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

10న జిల్లా సీనియర్స్ మెన్, ఉమెన్ ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెన్ అండ్ ఉమెన్ జిల్లా సెలక్షన్ ట్రయల్స్ ఈ నెల 10న ఉదయం 9 గంటలకు సత్తెనపల్లి సుగాలీకాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరుగుతాయని పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సుబ్రహ్మణ్యేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెలక్షన్ ట్రయల్స్‌కు వచ్చు క్రీడాకారులు వారి డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు ఒరిజినల్స్, జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకొని రావాలన్నారు. ఇతర వివరాలకు సెల్ నెంబర్ 7396967776లో సంప్రదించాలన్నారు.

ఎస్‌జీటీలకు వెబ్ కౌన్సెలింగ్ రద్దుచేయాలి



సత్తెనపల్లి: ఎస్‌జీటీలకు వెబ్ కౌన్సెలింగ్ రద్దుచేసి మాన్యువల్‌గా జరపాలని సత్తెనపల్లి ప్రాంతీయ ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని మండల విద్యాశాఖఅధికారి కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఎస్‌జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ జరపాలని, వెబ్ కౌన్సెలింగ్ రద్దు చేయాలని ఈ నెల 8న గుంటూరులోని ఉమ్మడి జిల్లా డీఈఓ కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు సత్తెనపల్లి ఎంఈఓ ఏ.శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎస్.ఎం.సుభాని, చిన్నం శ్రీనివాసరావు, శివారెడ్డి, రహమాన్, విష్ణు, సుబ్బు, సురేష్, అప్పారావు, కాపు నర్సింహారావు, రాఘవ, ధర్మారావు, రామారావు తదితర ఉపాధ్యాయులు ఉన్నారు.

మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించండి

శావల్యాపురం: సెకండరీ గ్రేడు ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఎస్టీయూ మండల ప్రధాన కార్యదర్శి బిళ్ళా రాజారమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ శనివారం చేశారు. ఇదే విధానాన్ని కొనసాగించాలని నిరసన తెలుపుతూ ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో (ఫ్యాక్టో) నేడు ఉదయం డీఈవో కార్యాలయం ముట్టడించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

భక్తుల సేవలో కోటప్పకొండ రెడ్ల సత్రం

- 2001లో సత్రం ఏర్పాటు
- సత్రం గదులలో యాత్రికులకు వసతి, ఉచితంగా భోజనం
- కులాలకు అతీతంగా వృద్ధాశ్రమం
- నేడు సత్రం సిల్వర్‌జూబ్లీ వేడుకలు



కోటప్పకొండలోని రెడ్ల సత్రం వ్యూ

నరసరావుపేట రూరల్: కోటప్పకొండలో శ్రీ యోగి వేమారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెడ్ల సత్రం సిల్వర్ జూబ్లీ ఉత్సవాలకు ముస్తాబైంది. పవిత్ర శైవక్షేత్రం కోటప్పకొండలో త్రికోటేశ్వరుని దర్శనానికి వచ్చే యాత్రికులకు సత్రంలో వసతి సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. సత్రంలోని వృద్ధాశ్రమంలో కులాలకు అతీతంగా వృద్ధులు సేవలు పొందుతున్నారు. 25 సంవత్సరాల కాలంలో సత్రం అభివృద్ధిలో పయనిస్తూ భక్తులకు విశేష సేవలు అందిస్తోంది. కోటప్పకొండలోని శ్రీ యోగిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 2001లో రెడ్ల సత్రం ప్రారంభమైంది. వెలుగోటి పిచ్చిరెడ్డి గౌరవ అధ్యక్షుడిగా, పల్లెల పిచ్చిరెడ్డి అధ్యక్షుడిగా 49 మంది సభ్యులతో సత్రం కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. దాతల సహకారంతో సత్రంలో నిత్యం అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. సత్రంలో ప్రస్తుతం 93 గదులను దాతల సహకారంతో అందుబాటులోకి తీసుకువచ్చారు. సత్రంలో సభ్యులుగా చేరే వారి సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. 49 మంది సభ్యులతో సత్రం ప్రారంభంకాగా నేడు 2287 మంది సభ్యులుగా ఉన్నారు. ప్రస్తుతం సత్రం కమిటీ గౌరవ అధ్యక్షుడిగా భవనం రాఘవ రెడ్డి, అధ్యక్షుడిగా కంజుల వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పాలిమేర వెంకట రెడ్డి, కోశాధికారిగా మాగులూరి సుబ్బారెడ్డిలు వ్యవహరిస్తున్నారు.

సత్రంలో వృద్ధాశ్రమం

సత్రంలోని గదులలో కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి వారి దర్శనానికి వచ్చే యాత్రికులకు వసతి సౌకర్యంతో పాటు ఉచితంగా భోజన సదుపాయాన్ని కల్పిస్తున్నారు. దీంతో పాటు సత్రంలో వృద్ధాశ్రమాన్ని నిర్వహిస్తున్నారు. కులాలకు అతీతంగా వృద్ధులు ఇక్కడ సేవలు అందుకుంటున్నారు. దాదాపు 80 మంది వృద్ధులు వృద్ధాశ్రమంలో ఉన్నారు. సత్రం కమిటీకి అనుబంధంగా నరసరావుపేట పట్టణంలో వినుకొండ రోడ్డులో రెడ్డి బాలుర హాస్టల్ నిర్వహించబడుతోంది. ఇక్కడ కులాలకు అతీతంగా పేద విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి ఉన్నత విద్య కోసం వచ్చే విద్యార్థులు హాస్టల్‌ను సద్వినియోగం చేసుకుంటున్నారు.



రెడ్లసత్రం స్వాగతద్వారం

నేడు సిల్వర్ జూబ్లీ వేడుకలు

ఈనెల 8వ తేదీ ఆదివారం ఉదయం 11 గంటలకు సత్రంలో సిల్వర్ జూబ్లీ వేడుకలను నిర్వహిస్తున్నారు. పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు కార్యక్రమంలో పాల్గొంటున్నారు. సత్రంలో రూ.50 లక్షలతో నూతనంగా నిర్మించనున్న భోజనశాల, గదులకు శంకుస్థాపన చేయనున్నారు. అలాగే రూ.20 లక్షలతో ఏర్పాటు చేయనున్న లిఫ్ట్ పనులను ప్రారంభిస్తారు. దీంతో పాటు సత్రం అభివృద్ధికి కృషి చేసిన దాతలను ఘనంగా సత్కరించనున్నారు.

తుది దశకు మేజరు కాల్వ పనులు



శావల్యాపురం మేజరు కాల్వ పరిశీలిస్తున్న అధికారులు

శావల్యాపురం: మండలంలోని గంటావారిపాలెం అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలో మేజరు కాల్వలు అభివృద్ధికి పనులు చేస్తున్నట్లు ఎన్నెస్పీ డీఈ జరుగుల విజయలక్ష్మి తెలిపారు. శనివారం మండలంలోని అన్నవరప్పాడు, శావల్యాపురం మేజరు కాల్వ పనులు ఎన్నెస్పీ అధికారులు పరిశీలించారు. డీసీ చైర్మన్ మందలపు వెంకట నారాయణ, నీటి సంఘం అధ్యక్షులు గుత్తా సీతారామయ్య, చెరుకూరి రామాంజనేయులు, ఏఈ పోట్లూరి లక్ష్మీనారాయణ ఉన్నారు.

గుండెపోటుతో హోంగార్డు మృతి



విజయ్‌బాబు (ఫైల్)

వినుకొండ: వినుకొండ టౌన్ పోలీస్‌స్టేషనులో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు విజయ్‌బాబు (35) శనివారం గుండెపోటుతో మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న టౌన్ సీఐ శోభన్‌బాబుతో పాటు పోలీసుసిబ్బంది విజయ్‌బాబు కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. ప్రభుత్వం తరఫునుంచి రావాల్సిన సాయం అందించేందుకు కృషి చేస్తామని భరోసాఇచ్చారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై కేసు

నరసరావుపేట రూరల్: పల్నాడు జిల్లా ములకలూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త షేక్ ఇర్ఫాన్‌పై రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై ఇర్ఫాన్ అనుచిత వ్యాఖ్యలు చేసినట్టు మండలంలోని లింగంగుంట్లకు చెందిన జనసేన పట్టణ కార్యదర్శి అప్పిశెట్టి లక్ష్మీనారాయణ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన పోలీసులు ఇర్ఫాన్‌పై శుక్రవారం రాత్రి కేసు నమోదు చేశారు. శనివారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్టు రూరల్ ఎస్ఐ కిషోర్ తెలిపారు.

రేపటి నుంచి ఉచిత యోగ శిక్షణ శిబిరం

నరసరావుపేట ఈస్ట్: శ్రీవేంకటేశ్వర యోగ సేవా కేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో ఈనెల 9వతేది నుంచి 187వ ఉచిత యోగ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్టు యోగా గురూజీ కూనిశెట్టి వెంకటజనార్ధన్ శనివారం తెలిపారు. శ్రీపట్టాభిరామస్వామి ఆలయంలోని శ్రీవెంకటేశ్వర కళ్యాణ మండపంలో ప్రతిరోజు ఉదయం 5గంటల నుంచి 7గంటల వరకు 28 రోజుల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. శిబిరంలో 42 యోగ భంగిమలు, ప్రాణాయామం, ధ్యానం, ఆహార నియమాలు, సూర్య నమస్కారాలు బోధించనున్నట్టు తెలిపారు. శిక్షణకు హాజరయ్యే అభ్యాసకులు యోగా మ్యాట్ వెంట తెచ్చుకోవాలని సూచించారు. వివరాలకు 9490846333, 9491665733 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

'ప్రైమరీ' హెచ్‌ఎంలుగా 178 మందికి ఉద్యోగోన్నతి



గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులుగా 78 మంది ఎస్జీటీలు ఉద్యోగోన్నతిపై నియామకం పొందారు. శనివారం కలెక్టర్ బంగ్లారోడ్డులోని గుంటూరు ఎంఈఓ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఉద్యోగోన్నతులు కల్పించారు. గుంటూరు, పల్నాడు జిల్లాల విద్యాశాఖాధికారులు సీవీ రేణుక, చంద్రకళ పర్యవేక్షణలో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలల్లోని హెచ్‌ఎంలను ఉద్యోగోన్నతిపై నియమించేందుకు దాదాపు 1,400 మంది ఉపాధ్యాయులను పిలిచారు. అయితే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందలాదిగా తరలివచ్చినప్పటికీ, ఉపాధ్యాయులు ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా వెళ్లేందుకు విముఖత వ్యక్తం చేశారు. ఎట్టకేలకు 78 పోస్టులను ఉద్యోగోన్నతులతో భర్తీ చేశారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో గుంటూరు డీవైఈఓ యేసురత్నం, ఎంఈఓలు ఎ.తిరుమలేష్, సీనియర్ హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ప్రజలు పోరాటాలకు సిద్ధంగా ఉండాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ శ్రేణులు

నరసరావుపేట ఈస్ట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ప్రజలు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. అరండల్‌పేటలోని సీపీఐ కార్యాలయంలో శనివారం నరసరావుపేట నియోజకవర్గ పట్టణ మహాసభ నిర్వహించారు. కార్యాలయం ఎదుట పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి మహాసభలో మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రధాని మోదీ నాయకత్వంలో కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ పేదల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని విమర్శించారు. నల్ల ధనాన్ని వెలికితీసి పేదలకు అందిస్తానని చెప్పిన మోదీ నేడు నల్ల చట్టాలను తీసుకవచ్చి రైతులు, కార్మికులను దారుణంగా మోసగించాడని తెలిపారు. మత రాజకీయాలు చేస్తూ ప్రాంతాల మధ్య, ప్రజల మధ్య చిచ్చుపెడుతూ పబ్బం గడుపుకుంటున్నారని దుయ్యబట్టారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలకు సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలను దారుణంగా మోసగిస్తున్నాడని విమర్శించారు. సూపర్‌సిక్స్‌తోపాటు ఎన్నో హామీలను గుప్పించి ఏడాది కాలం గడుస్తున్నా ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని తెలిపారు. పేదలకు వెంటనే ఇళ్ల స్థలాలు మంజూరు చేసి గృహ నిర్మాణాలకు ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సీపీఐ పల్నాడుజిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాదు, సహాయ కార్యదర్శులు షేక్ హుస్సేన్, కాసా రాంబాబు, ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఉలవలపూడి రాము, నియోజకవర్గ కార్యదర్శి చక్రవరం సత్యనారాయణరాజు, ఏఐటీయూసీ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, వైదన వెంకట్, షేక్ చినజాన్‌సైదా పాల్గొన్నారు.

స్నేహమేరా జీవితం.. శాశ్వతం!



ఆత్మీయ సమ్మేళనలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

శావల్యాపురం జడ్పీ హైస్కూల్ 2003–2004 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

శావల్యాపురం: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో 2004–2005 పదో తరగతి పూర్వ విద్యార్థులు బ్యాచ్ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత తమ గురువులను పూలమాలలతో ఘనంగా స్వాగతం పలికిన అనంతరం తాము చదువుకున్న స్కూల్లో 20 సంవత్సరాల తర్వాత అందరిని కలుసుకొని ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని ఆనాటి మధుర జ్ఞాపకాలను తరగతి గదుల్లో తీపి గుర్తులు మాట్లాడుకున్నారు. తమ గురువులు నేర్పిన విద్య ద్వారా ఈస్థాయిలో ఉన్నట్లు వెల్లడించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు యర్రం హనుమంతరావు మాట్లాడుతూ తమ దగ్గర చదువుకున్న విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఎదిగి ఐక్యంగా గురువులను గౌరవించుకోవటం చాలా ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఉపాధ్యాయులు యర్రం హనుమంతరావు, సి.హెచ్. చంద్రశేఖర్, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, కె.జె.రమేష్, ఆర్‌కె.రమేష్ తదితరులను ఘనంగా పూలమాలలు దుశ్శాలువాలతో సత్కరించారు. ఈకార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గుత్తా వెంకటరావు, పాలడుగు శ్రీను, తులబందుల రమ్య, చిలంకూరి నాగలక్ష్మి, జవంగుల నాగరాజు, పరమేశ్వరరావు, యలవర్తి శిరీషా, పాలడుగు సాయి. 45 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యాపారి మృతి



నాదెండ్ల: రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన నాదెండ్ల మండలం సాతులూరు గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. రైల్వే ఇన్‌చార్జి ఎస్సై దీపిక తెలిపిన వివరాల మేరకు.. సాతులూరు గ్రామానికి చెందిన బయ్యన పరాత్పరరావు (65) రైస్‌మిల్లు వ్యాపారం చేస్తుండే వాడు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వాకింగ్ చేస్తుంటాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం 7.30 గంటల సమయంలో చందవరం–బుక్కాపురం రోడ్డుపై వాకింగ్‌కు వెళ్లాడు. రైల్వే గేటు దాటుతుండగా గుంటూరు–నంద్యాల వెళ్తున్న రైలు ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్తులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. లోకో పైలట్ ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. శనివారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య, ఇరువురు కుమార్తెలు ఉన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

నరసరావుపేటటౌన్: ప్రమాదవశాత్తూ రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం పట్టణంలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాష్‌నగర్‌కు చెందిన ఇల్లూరి వీరాంజనేయరెడ్డి(38) మొదటి రైల్వే గేటు వద్ద రైలు పట్టాలు దాటుతున్న సమయంలో రైలు ఢీకొంది. సంఘటనలో తీవ్రగాయాలైన వీరాంజనేయరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఇన్‌చార్జి ఎస్ఐ దీపిక సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు.

మనవళ్లు దాడి చేశారంటూ ఫిర్యాదు

యడ్లపాడు: మండలంలోని కొండవీడు గ్రామంలో దారుణమైన ఘటన చోటు చేసుకుంది. ఒకరికి అమ్మమ్మ, మరొకరికి నాయినమ్మ అయ్యే వృద్ధురాలిపై దాడి చేశారంటూ బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. పోలీసుల కథనం ప్రకారం..కొండవీడు గ్రామానికి చెందిన తోట లక్ష్మీకాంతమ్మ తన మనవళ్లు మహేష్‌బాబు, దమ్ము రామారావులకు తరచు డబ్బులు ఇస్తుంటుంది. ఈ విషయాన్ని వారి తల్లులకు చెప్పిందని ఆగ్రహిస్తూ ఈనె 4వ తేదీన మహేష్‌బాబు తన నాయినమ్మపై గొడవపడి జుట్టుపట్టుకుని కొట్టాడంటూ ఫిర్యాదులో పేర్కొంది. దాడి చేయగానే ఆమె కొండవీడు నుంచి చిలకలూరిపేటలో నివాసం ఉంటున్న తన కుమార్తె మాధవి వద్దకు వెళ్లింది. అయినా ఆమెకు ఫోన్లు చేసి మనవళ్లు వేధింపులకు గురి చేయడంతో పోలీసులను ఆశ్రయించి తన గోడును విన్నవించుకుంది. దీంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ టి శివరామకృష్ణ తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఐదుగురు విద్యార్థులు



కొప్పరపు పూజిత



నారె శశిప్రియ



వేపూరి జ్యోతి స్వరూప



కొర్లపాటి గణేష్



పాతలావతు భవ్య శ్రీ బాయి

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెంలో గల ఏపీ మోడల్ స్కూల్‌లో ఐదు గురు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బి. రవినాయక్ శనివారం తెలిపారు. గత సంవత్సరం డిసెంబర్ నెలలో నిర్వహించిన 2024–2025 విద్యాసంవత్సరానికి గాను నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ పోటీ పరీక్షల్లో తమ విద్యార్థులు మంచి మార్కులు సాధించారన్నారు. పాఠశాలకు చెందిన కొప్పరపు పూజిత, కొర్లపాటి గణేష్‌లు 180 మార్కులకు గాను 161 మార్కులు సాధించగా, నారే శశిప్రియ 120 మార్కులు, వేపూరి జ్యోతి స్వరూప 114 మార్కులు, పాతలావతు భవ్యశ్రీ బాయి 89 మార్కులు సాధించి ప్రతిభ కనపరిచారన్నారు. వీరందరికీ సంవత్సరానికి రూ. 12 వేల రూపాయల చొప్పున 4 సంవత్సరాలపాటు రూ.48 వేల రూపాయలు స్కాలర్‌షిప్ అందుతుందని ఆయన చెప్పారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులను ఎస్ఎంసీ కమిటీ, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు.

ధర్మోరక్షతి రక్షితః ట్రస్ట్ భవనం ప్రారంభం



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

తాడికొండ: హైందవ ధర్మ విశిష్టత ప్రపంచానికి చాటి చెప్పడంలో శివస్వామి కృషి ఎనలేనిదని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. శనివారం తుళ్లూరు మండలం తాళ్లాయపాలెంలోని శైవ క్షేత్రంలో ధర్మోరక్షతి రక్షితః ట్రస్ట్ నూతన భవనం ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ట్రస్ట్ నూతన భవనం ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. నిర్మాణ దాతలు సతీష్ ఉమరాణి దంపతులకు ధన్యవాదాలు తెలియజేశారు. శివస్వామి ఈ ట్రస్ట్‌లో 64 సేవా విభాగాలు ఏర్పాటుచేసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. గో సంరక్షణ ద్వారా ఆరు వేల గోవులను రక్షించి వాటి పోషణ చూసుకోవడం అభినందనీయమన్నారు.మానసారా–మన సారె అనే కార్యక్రమం ద్వారా అనేక రాష్ట్రాల్లో అమ్మవారికి కార్యక్రమాలు నిర్వహిస్తూ సంస్కృతి పట్ల యువతకు అనేక ప్రయోజకర కార్యక్రమాలు అందిస్తున్నారన్నారు. భక్తునిగా శివస్వామికి తాను శిరస్సు వచ్చి పాదాభివందనలు చేస్తున్నారన్నారు. శివస్వామి మాట్లాడుతూ ధర్మోరక్షతి రక్షితహ భవనాన్ని ధార్మిక సేవా భావాలతో 2009 నుంచి నిర్వహిస్తున్నానని తెలిపారు.